కర్నూలు | నంద్యాల
వార్త
28 అక్టోబరు, 2022 | శుక్రవారం | పేజీలు 4




# నాడు-నేడులో.. నాకింత.. నీకింత..!

**- పనులు చేయకుండా బిల్లులు స్వాహా**
**- మరోవైపు నాసిరకం పనులు**



**ఆదోని రూరల్,అక్టోబరు 27,ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలకు నాడు-నేడు కింద మరమత్తులు మరియు అదనపు గదుల నిర్మాణం కోసం పనులను చేపట్టింది. మొదటి విడతలో కొన్ని పాఠశాలలో మరమత్తులు చేశారు. రెండో విడతలో భాగంగా మళ్లీ ఇప్పుడు పాఠశాలలో అదనపు గదుల కోసం రెండో విడత నాడు-నేడు నిధులను విడుదల చేసింది. ఈ నిర్మాణ పనుల్లో కొన్నిపాఠశాలల్లో నాసిరకంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల నాసిరకంగా ఉండడంతో కుప్పకూలినట్లు సమాచారం. అయితే పనులు చేసిన తర్వాత బిల్లులు మంజూరు చేసే భాద్యతను పాఠశాల హెడ్మాస్టర్‌కు అప్పగించింది. కానీ ఒక పాఠశాలలో ఓ హెడ్మాస్టర్ పనులు జరగకుండ రూ.లక్షల్లో నిధులను డ్రాచేసి తన సొంత పనులకు వాడుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే ఇలాంటి అవినీతి ఉపాధ్యాయులు మాత్రం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను డ్రాచేసి తమ సొంత పనులకు వాడుకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కారుస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.ఇలాంటి ఉపాధ్యాయులు ఉన్నంత వరకు ప్రభుత్వం అనుకున్న కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఇంగ్లీషులో విద్యాభ్యాసం లక్ష్యం ఎక్కడ నెరవేరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# సంక్షేమ పథకాలు.. అర్హులందరికీ అందాలి

**: కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ**

**కర్నూలు, అక్టోబర్,27, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా అన్ని జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ సూచించారు. గురువారం వెలగపూడిలోని సచివాలయం నుంచి స్పందన, హౌసింగ్, తదితర అంశాల పై జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిసమీర్‌శర్మ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో జిల్లా కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులు అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. స్పందన, హౌసింగ్, రీసర్వే, టిడ్కో గృహాలకు రుణాల మంజూరు మరియు ఎంఐజి లేఔట్స్, అనీమియా మరియు మాల్ న్యూట్రిషన్ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారందరికీ అందేలా కృషి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగానిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్ లు ఎన్.మనోజ్ రెడ్డి, జి.వి.రమణ కాంత్ రెడ్డి తదితర జిల్లాధికారులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియా..!

**- అక్రమ రవాణాలకు అడ్డుకట్ట పడేనా..?**

- యద్దేచ్ఛగా గ్రావెల్, ఎర్రమట్టి రవాణా
- గ్రావెల్ తవ్వకాలతో పచ్చటి పంటపొలాలు మట్టిపాలు
- రాత్రి 10 గంటలకు ప్రారంభం.. ఉదయం 5 గంటల కల్లా పనులు పూర్తి
- రైతుల గోడు పట్టని అధికారులు





**మహానంది, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లాలో మట్టిమాఫియా చేలరేగిపోతుంది. అటవీభూముల్లో ఇష్టరాజ్యంగా తవ్వకాలు చేస్తు మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వం ఎర్రమట్టి, ఇసుక, గ్రావేల్, మద్యంపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నియమించింది. అయితే అక్రమార్కులు, స్థానికనేతలు అధికారుల అండదండలతో యద్దేచ్ఛగా మట్టితవ్వకాలు చేసి ప్రభుత్వ ఖజానకు గండికోడుతున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతం అనుకుంటే పొరపాటే నంద్యాల జిల్లా కేంద్రానికి సమీపం దూరంలో ఈమట్టి వ్యాపారం కొనసాగుతుంది. మరి అధికారులు ఏమిచేస్తున్నట్లు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్, ఎర్రమట్టికి అడ్డుకట్ట వేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

• వివరాలు 2లో



## నాపరాతి గనుల్లో..

# 'దొంగల హల్‌చల్ ..!'

- రూ.లక్షలు విలువ చేసే కాపర్ వైరు ఎత్తు కెళ్తున్న దుండుగలు
- గ్రామాల్లో ఇళ్ల వద్ద మోటార్లను సైతం ఎత్తుకెళ్తున్న దుండుగలు
- పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకోని వైనం ..
- లబో దిబో మంటున్న గనుల యజమానులు

**కొలిమిగుండ్ల, అక్టోబరు 27, ప్రభాతవార్త :** కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో నాపరాతి గనుల్లో గత కొంత కాలంగా దొంగలు హాల్ చల్ సృష్టిస్తున్నారు. గనుల్లో నాపరాయి కటింగ్ మిషన్‌లకు ఉపయోగించే కాపర్ వైరు లక్ష్యంగా చేసుకొని తరచూ గనుల్లో దొంగతనాలకు పాల్పడుతూ రెచ్చి పోతున్నారు. పోలీసులు కూడా పట్టించుకోక పోవడంతో దొంగల బెడద అధికంగా మారిందన్న అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో నాపరాతి గనుల యజమానులు లబో దిబో మంటున్నారు. మండలంలోని సగానికి పైగా గ్రామాల్లో ప్రజలకు నాపరాతి గనులే ప్రధాన జీవనాధారం. మండల వ్యాప్తంగా సుమారు 10వేల మందికి పైగా ప్రజలు నాపరాతి గనుల్లో పనులు చేస్తూ బ్రతుకు దెరువును కొనసాగిస్తున్నారు. ఇందులో మండల వ్యాప్తంగా 5వేలకు పైగా నాపరాయి కటింగ్ మిషన్ యంత్రాలు గనుల్లో వుండగా ఒక్కో గనిలో రూ.20వేల నుండి రూ.1లక్ష వరకూ విలువ చేసే కాపర్ వైరు వినియోగిస్తారు. అయితే కాపరు వైరు తరచూ దొంగతనానికి గురవుతుండడంతో గనుల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. రూ.లక్షలు విలువ చేసే కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్తుండటంతో తీవ్ర అందోళన చెందుతున్నారు. అసలే నాపరాతి పరిశ్రమలు నష్టాల్లో వుండగా దొంగతనాల బెడదతో మరింత నష్టపోతున్నామని యజమానులు వాపోతున్నారు. ఒక్కో గనిలో నెలకు రెండు సార్లు కూడా దొంగతనాలు జరుగుతుండటంతో గనుల యజమానులకు ఏంచేయాలో పాలు పోని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కనకాద్రిపల్లె గనులు, అంకిరెడ్డిపల్లె, బెలుం, మీర్జాపురం, కొలిమిగుండ్ల సమీపంలోని కొండ వెనుక గనుల్లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. గతంలో పోలీసులకు అనేక మార్లు పిర్యాదు చేసినా, కేసులు నమోదు చేయలేదని నాపరాతి గనుల యజమానులు వాపోతున్నారు. గత నెల రోజుల వ్యవధి లోనే మండలంలో రూ.5లక్షలు విలువ చేసే కాపర్ వైరు దొంగలు ఎత్తుకెళ్లారంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు మండల కేంద్రమైన కొలిమిగుండ్ల ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న తాగునీటి మోటార్లను సైతం ఎత్తుకెళ్లిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. అయినా పోలీసులు పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇదే అదనుగా చిన్న చిన్న దొంగతనాలు మండలంలో మరింత ఎక్కువగా పెరుగుతున్నా యన్న ఆరోపణలు సైతం చోటు చేసుకుంటున్నాయి. గత నెల రోజుల వ్యవధిలోనే రెండు సార్లు కాపర్ వైరు దొంగతనానికి పాల్పడ్డారని గనుల యజమానులు ఇటిక్యాల తిరుమలరెడ్డి, కనకాద్రిపల్లె తలారి నాగప్ప, అంబటి నరసి oహా రెడ్డి, బోయ గంగరాజు, పెట్నికోట, నాయినిపల్లె గ్రామాలకు చెందిన గనుల యజమానులు అవేదన వ్యక్తం చేశారు. పోలీసులు దొంగ లపై నిఘా వుంచి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఆయకట్టు రైతులకు.. నీరు అందించాలి

- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ



**ఆలూరు,అక్టోబరు 27,ప్రభాతవార్త :** ఆయకట్టు రైతులకు నీరు అందించాలని మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి,ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మలు అన్నారు. గురువారం ఆలూరు నియోజకవర్గంలోని చింతకుంట సెక్షన్ పరిధిలో గల 121కి.మీల వద్ద కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామ సమీపంలో ఉన్న బరదనహళ్లి గ్రామం దగ్గర హగరిపై నిర్మించిన ఎల్ఎల్‌సి కెనాల్ బ్రిడ్జిని కేంద్ర మాజీమంత్రి సూర్యప్రకాష్‌రెడ్డి,ఆలూరు తెదేపా ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మలు తెదేపా నాయకులు,రైతుసంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఆంధ్రా-కర్ణాటక ఆయకట్టు రైతులు ఆదోని,ఆలూరు,హొళగుంద, హాలహర్వి తదితర మండలాల నుండి పెద్ద సంఖ్యలో తెదేపా నాయకులు,రైతులు,కర్ణాటక రైతుసంఘం నాయకులు పురుషోత్తంగౌడ్,టిబి బోర్డు అధికారులు నీలకంఠేశ్వరరెడ్డి,అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్‌టిఓలు ఆదిప్రతాప్, భక్తవత్సలం తదితరులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గత 15రోజుల నుండి ఎల్ఎల్‌సి కాలువకు నీరు రాకపోగ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. వరి రైతులు,ఆయకట్టు రైతులు పంట చేతికందే సమయంలో ఎల్ఎల్‌సికి నీరు లేకపోవడంతో పంటల కోసం పెట్టిన పెట్టుబడులు చేతికందుతాయో.. లేదోనని.. ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. అయితే ఎల్ఎల్‌సి అధికారులు మాత్రం ఇంతవరకు రైతన్నలకు నీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి,రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వాలు రైతుల పక్షపాతిగా ఉంటూ రైతు వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఓ పక్క ప్రకృతి అధిక వర్షాల వల్ల రైతులు నష్టపోతుంటే ఆయకట్టు అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ కళ్లెదుటే వరిపంట నీరు లేక ఎండిపోతుందని వాపోయారు. అయితే అధికారులలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చలనం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించి అధికారులు,ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు మరో వారం రోజుల పాటు లేదా రాబోయే 1వ తేదీ లోపు పనులను వేగవంతం చేసి రైతులకు సాగు,తాగునీటిని అందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదోని నుండి భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప, రామస్వామి,పాలకుర్తి శ్రీనివాసరెడ్డి,మాజీ జడ్‌పిటిసి మీనాక్షినాయుడు, వెంకటేష్, రఘురెడ్డి, పాల్‌రెడ్డి, నారాయణరెడ్డి,హరిరెడ్డి,శంకరప్ప,లింగప్ప,మల్లప్ప,నరసప్ప,దేవేంద్ర,అశోక్‌యాదవ్,ఈరన్నగౌడ్,కాకిసీతయ్య,అయ్యప్ప,శ్రీకాంత్‌రెడ్డి,దేవనకొండ విజయభాస్కర్‌గౌడ్, రంగన్న,మల్లయ్య,మాలిక్,పరమారెడ్డి,లక్ష్మన్న,నారాయణ, రాజశేఖర్,ఆంధ్ర,కర్ణాటక ఆయకట్టు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాల.. విద్యార్థినీలకు జ్వరం..!

- వెంటనే స్పందించిన డాక్టర్
- 200 మంది విద్యార్థినులకు రక్త పరీక్ష

**మిడుతూరు, అక్టోబర్27, ప్రభాతవార్త ;** మిడుతూరులోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినీలు జ్వర పీడితులై బాధ పడుతున్నారు. సమాచారం అందుకున్న డాక్టర్ శివకుమార్‌గౌడ్ వెంటనే తన వైద్య సిబ్బందితో పాఠశాలను సందర్శించి వైద్య చికిత్సలు ప్రారంభించారు. ముందుగా పాఠశాలలోని 200 మంది విద్యార్థిణులకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం ఆరు, ఏడు, పది తరగతుల్లోని విద్యార్థులు అధికంగా జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి 14 మంది విద్యార్థులకు వెంటనే డాక్టర్ చికిత్సలు చేశారు. ఇదిలా ఉండగా పాఠవాల ఆవరణ ప్రాంతాలు వంటగదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. అయితే ఈ జ్వరాలు ఎందుకు ప్రబలుతున్నట్లు అనే విషయంపై డాక్టర్ ఆలోచించి విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షల ఫలితాలు నాలుగు రోజుల్లో వస్తాయని డాక్టర్ చెప్పారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పాఠశాల ఏఎన్ఎం దగ్గర మందులు నిల్వ ఉంచినట్లు చెప్పారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రపరుచుకోవాలన్నారు. అలాగే స్థానిక సామాజిక వైద్యశాల పిల్లల డాక్టర్ తిరుపాలు పాఠశాలను సందర్శించారు. కాగా ఈఓపీఆర్‌డీ ఫక్రుద్దీన్ వైద్య సిబ్బంది వంట గదులకు వెళ్లి భోజన సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలకు తాగునీరు నిల్వ చేసే ట్యాంకులను పరిశుభ్రపరుచుకోవాల్సిన అవసరం ఉంది, పాఠవాలలపై ప్రత్యేక దృష్టి పెట్టామని రక్త పరీక్షల ఫలితాలు రాగానే మరింత మెరుగైన వైద్యం సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని డాక్టర్ శివకుమార్‌గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది యేసేపు, జ్యోతి, మీనా, లక్ష్మిదేవి, రామతులసమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామకంఠం భూములను రీసర్వే చేయండి

- పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టండి
- విడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పిఆర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్



**నంద్యాల/ కర్నూలు అక్టోబర్ 27, ప్రభాతవార్త:** జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం కింద గ్రామాల్లో ఉన్న గ్రామ కంఠం భూములను సమగ్ర సర్వే జరిపి నిజమైన హక్కుదారులను గుర్తించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణ ద్వివేది అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి కమిషనర్ కోన శశిధర్‌తో కలిసి విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ప్రాధాన్యత నిర్మాణ భవనాలు జగనన్న స్వచ్ఛ సంకల్పం, గ్రామకంఠం భూముల రీసర్వే, సంపూర్ణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ జిల్లాలో 1078 ప్రయార్టీ భవనాల నిర్మాణాల్లో 296 గ్రామ సచివాలయాలు, 158 రైతు భరోసా కేంద్రాలు, 95 వైయస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మిగిలిన 118 సచివాలయాల భవనాలు 235 రైతు భరోసా కేంద్రాలు, 176 వైయస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పాణ్యం మండలం కొండజూటూరు గ్రామంలో సచివాలయ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలం పాఠశాల సముదాయంలో ఉన్నందున తిరిగి ప్రతిపాదనలు పంపాలని అదేశించారు. గ్రామీణ ఉపాధి హామి పథకం కింద లక్ష్యం మేరకు కూలీల సంఖ్యను పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టరు అధికారులకు నివేదించారు. భవన నిర్మాణాల్లో పురోగతి పెంచి త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలు పూర్తి ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఎస్ఇ రాంమోహన్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిపిఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ఇ మనోహార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తాం..

- గడప గడపలో మంత్రి జయరాం



**దేవనకొండ,అక్టోబరు 27,ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం ముందుగా గ్రామ సచివాలయం-2ను సందర్శించారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో వారి పనివిధానం గురించి చర్చించారు. గ్రామసచివాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఆద్వర్యంలో సబ్సీడీపై అందించిన వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద రైతు బోయ రవికి ట్రాక్టర్,మిల్లర్ అందించారు. ఆత్మహత్య చేసుకున్న రైతు ముత్తు బండ్లయ్య కుటుంబానికి ప్రభుత్వం అందించిన రూ.7లక్షల చెక్కును అందచేశారు. అనంతరం గ్రామంలోని 2,3 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులుతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలలో ఇంటింటికి పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయి వాటి ప్రయోజనాల గురించి ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు,ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందని పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కిట్టు,ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుమంబా, ఏడిఎ మోహన్ విజయ్‌కుమార్,ఏఓ సురేష్‌బాబు,సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ భూపాలుడు,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళీ మోహన్,వైసిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, హంపిరెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు,నీలి రాజశేఖర్,శాంతి కుమార్, గఫూర్,రామచంద్ర,కందనాతి రంగన్న, చంద్రన్న, కబీర్, యూసుఫ్ భాష, మద్దిలేటి,నరసప్ప, భాస్కర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహిమాన్,విఆర్ఓ జాకీర్, వాలంటరీలు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడితో సమావేశమైన టీజీ భరత్



**కల్లూరు,అక్టోబర్27,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ కలిశారు. విజయవాడలో జరిగిన నియోజకవర్గ రివ్యూ మీటింగ్‌లో చంద్రబాబు నాయుడితో టీజీ భరత్ సమావేశమయ్యారు. కర్నూలులో టీడీపీ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు నాయుడికి వివ రించినట్లు టీజీ భరత్ చెప్పారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కర్నూలులోని 33వ వార్డులో, ఒకరోజు అన్న క్యాంటీ న్లను నిర్వహించినట్లు టీజీ భరత్ చెప్పారు.

# మట్టిమాఫియా..!

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల మండలంలోని చోటా మోటా నేతలు,నాయకులు నంద్యాల, గిద్దలూరు ప్రధాన రహదారి వెంట గతంలో ఎర్రమట్టి తరలించి అమ్మిన కుంటల పొలాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి నల్లమల అటవీ ప్రాంతంలోని గ్రావెల్ పొలాలను గాజులపల్లె చెరువులోని మట్టిని తరలించి బాగ చదును చేసి కోట్ల రూపాయలకు తిరిగి విక్రయించడం వారి ప్రధాన వ్యాపారం. రాత్రి 10 గంటలకు సమయంలో ప్రారంభమైన అక్రమ మట్టి రవాణా ఉదయం 5 గంటల లోపు నిలిపివేస్తారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా రాత్రి అంతా యద్దేచ్ఛగా అక్రమ రవాణా చేస్తారు. అనంతరం ఏవరికి ఏమి తెలియనట్లుగా వ్యవహ రించడం వీరికి పరిపాటి. రైతుల బాగోగులు ముఖ్యమని తెలుపుతున్న రాజకీయ నాయకులు వారి అక్రమ వ్యాపారానికి అడ్డదారులు తొక్కుతు న్నారు. రాజకీయం, పలుకుబడి అనే హోదాలతో మట్టితో వ్యాపారం చేసి కోట్లు దండుకుంటున్నారు. గతంలో రెవిన్యూ అధికారులు నిరుపేదలకు డి పట్టాలు పంపిణి చేశారు. అయితే తక్కువ ధరకు కొనుగోలు చేసి పొలంలోని గ్రావెల్‌ను, మట్టిని అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో పచ్చని పొలాల మట్టికొట్టుకుపోతున్నాయి. నంద్యాల జిల్లా మహానంది మండల పరిధిలోని గాజులపల్లె, రెవిన్యూ పరిధిలోని బసావాపురం చెరువు సమీపంలోని బంజరు భూములు ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో ఆ ప్రాంతం లో ఇటుకలు తయారుచేయడం కోసం కావాల్సిన మట్టి సమృద్ధిగా లభిస్తుండడంతో కొందరు నాయకులు ఆ ప్రాంతంపై కన్నెశారు. పచ్చని పొలాల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం గ్రావెల్ తవ్వకాలను ప్రారంభించారు. ఇంకేముంది రైతులు ఇంతకాలం సాగుచేసిన పచ్చని పొలాలు మట్టికొట్టుకుపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటచేతికి వస్తుందన్న ఆశతో ఎదురు చుస్తున్న రైతులకు నోట్లో మట్టిపడినట్లుయితే అడ్డుకోవాల్సిన రెవిన్యూ అధికారులు ఏమితెలి యనట్లుగా వ్యవహారిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అంతేకాకుండా గాజులపల్లె నుంచి బసవాపురం చెరువు వరకు ప్రభుత్వం వేసిన తారురోడ్డు నిరంతరం వందలాది మట్టి టిప్పర్లు తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడయిపోయింది. దీంతో రాబోయే కాలంలో రైతులు పండించిన పంటలను ఎలా తరలించుకోవాలో అలోచనలో పడ్డారు. కమిషన్ల కోసం రోడ్డు వేసేది వారే వారి స్వలాభంకోసం చెడగొట్టెది కూడ వారేనని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు స్థానిక ఎమ్మెల్యే సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్, మట్టి తవ్వకాలను నిలిపివేయాలని రైతులు, స్థానికులు కోరుతు న్నారు. ఈవిషయంపై మహానంది తహాశీల్దారు జనార్థన్‌శెట్టిని వివరణ కోరగా మేము మట్టి తవ్వేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అలా అక్రమంగా తరలించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## నెట్ బాల్ క్రీడాకారులకు అండగా నిలుస్తాం

– విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి

**కర్నూలు, అక్టోబర్,27, ప్రభాతవార్త :** నెట్ బాల్ క్రీడలో విశేషంగా రాణిస్తున్న జిల్లా క్రీడాకారులకు తమ సంస్థ తరఫున అన్ని విధాలా అండగా నిలుస్తామని విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి చెప్పారు. ఈ నెల 29, 30 తేదీలలో విజయవాడలో జరుగనున్న అంతరాష్ట్ర నెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా నెట్ బాల్ క్రీడాకారులకు స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో విజయ డైరీ సహకారంతో టీ-షర్ట్ లు అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ నెట్ బాల్ క్రీడ ప్రపంచవ్యాప్తంగా 36 దేశాలలో వ్యాప్తిలో ఉందని, మనదేశంలో ఇప్పుడిప్పుడే ఈ క్రీడకు ప్రాచుర్యం లభిస్తోందని అన్నారు. జిల్లాలో నెట్ బాల్ క్రీడ అభివృద్ధికి తన వంతు ప్రోత్సాహం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సెట్కూర్ సి. ఐ. ఓ రమణ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, క్రీడాకారులకు ఎటువంటి సౌకర్యం కల్పించడానికైనా తాము సిద్ధంగా ఉంటామని అన్నారు. జిల్లా నెట్ బాల్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరబాబు మాట్లాడుతూ నెట్ బాల్ క్రీడాకారులకు ఏకాగ్రత, పట్టుదల అలవడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, వ్యవస్థాపకులు నాగరత్నమయ్య, బాలాజీ, శ్రీనివాసులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవా కాలువకు నీటిని వదలాలి

**పత్తికొండ,అక్టోబరు 27,ప్రభాతవార్త :** హంద్రీనీవా కాలువకు నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని టిడిపి జిల్లా నాయకులు,పార్లమెంట్ కమిటీ నాయకులు,తాలుక నాయకులు,మండల నాయకులు అన్నారు. గురువారం దూదేకుల రోడ్డులో ఉన్నటువంటి హంద్రీనీవా కాలువలో దిగి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా 20రోజులపైన హంద్రీనీవా కాలువకు నీటిని ఆపివేయడం జరిగిందన్నారు. దీనికి కారణం అధిక వర్షాలు పడుతున్నాయని కాలువ పక్కన ఉన్న పొలాల్లో నీళ్లు ఎక్కువయ్యాయని,కాలువ గట్టు తెగుతాయని సాకులు చెబుతూ నీరు విడుదల చేయడం ఆపివేయడం జరిగిందన్నారు. దీనికి ముఖ్యకారణంగా జగన్‌రెడ్డి ప్రభుత్వం కరెంటు బిల్లు కట్టక,మోటర్ల మెయింటెనెన్స్ సరిగ్గా చేయలేక నీటి విడుదల నిలిపివేయడం జరిగిందన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం కాదని మీరు వెంటనే హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని లేనిచో రైతులతో పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దూదేకొండ గ్రామరైతులు పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్యశిబిరం విజయవంతం

**ఆస్పరి,అక్టోబరు 27,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గాంధీ పార్క్ ఆవరణంలో ఆలూరు నియోజకవర్గ యువనేత మసాల ప్రకాష్ ఆధ్వర్యంలో అమిలియో హాస్పిటల్స్ మరియు గ్రీటింగ్ హాండ్స్ ఫౌండేషన్ సహకారంతో జరిగిన మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రకాష్ మాట్లాడుతూ ఆస్పరి మండలంలోని ప్రజలకు అందని ద్రాక్షగా మారిందని ప్రజల ఆరోగ్యం నిమిత్తం ప్రజాశ్రేయస్సు కొరకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వైద్యశిబిరం నందు కంటి సమస్య ఉన్న వారికి మరియు బిపి,షుగర్,గుండె జబ్బులతో పాటు గుండె ఇబ్బందులతో పాటు మరియు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా చూడడం జరిగిందన్నారు. దాదాపు 550మంది చూపించుకోవడం జరిగిందన్నారు. మండల ప్రజలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరించాలని ఆస్పరి మండల యూత్ తరుపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం గ్రీటింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉదయ్,విజయ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఎంబిబిఎస్ డాక్టర్స్ యశోద,సోమశేఖర్,వైద్యబృందం ఆస్పరి మండల యూత్ నాయకులు మల్లికార్జున,వీరేష్,సందీప్ రవి,మహేంద్ర,మునిస్వామి, బాలుముని,సిద్దేశ్,అక్బర్,జ్యోతిష్‌లు పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయండి

**ఆదోని,అక్టోబరు 27,ప్రభాతవార్త :** నేడు (శుక్రవారం) ఆదోని డివిజన్‌లోని ప్రభుత్వ,ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో జరుగు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ జెవివి ప్రతి ఏడాది సైన్స్ సంబరాల్లో బాగంగా విద్యార్థి లోకానికి సైన్స్‌ను చేరువ చేయడానికి పిల్లల్లో సైన్స్ పట్ల కుతూహలం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు నిర్వహించడం ఉపాధ్యాయ లోకానికి విధితమే. ఉపాధ్యాయ లోకం,విద్యార్థుల తల్లిదండ్రులు ,సైన్స్ ప్రేమికులు జెవివి నిర్వహించే సైన్స్ ఉద్యమంలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదోని డివిజన్ నుండి సుమారు 4500మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీలను జయప్రదం చేయాలని సైన్స్ ఔత్సాహికులకు విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మిస్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**కౌతాళం, అక్టోబర్27, ప్రభాతవార్త ;** వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సమేతంగా గురువారం మండలంలోని ఉరుకుంద లక్ష్మినరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈరన్న స్వామి వారిని దర్శించుకుని బుదుములదొడ్డి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజుగౌడ, రామన్నగౌడ, మాబుసాబు, బుజ్జిస్వామి, పాల్ దినకరన్, లింగన్నగౌడ తదితరులు పాల్గొన్నారు. కౌతాళంలోని వైసీపీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని పలు అభివృద్ధిపై చర్చించారు.

## మినిమమ్ టైం స్కేల్ వర్తింపచేయాలి

– ఏఐటియుసి రాష్ట్ర నాయకులు రమేష్‌బాబు,మునెప్ప

**ఆలూరు,అక్టోబరు 27,ప్రభాతవార్త :** మోడల్ హాస్టల్ వార్డెన్లకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపచేయాలని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు రమేష్‌బాబు,మునెప్పలు గురువారం విజయవాడలో విద్యాశాఖ కమీషనర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 134ఏపి మోడల్ స్కూల్స్‌కు అనుబంధంగా ఉన్న గర్ల్స్ హాస్టల్స్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వార్డెన్లకు 24/7 విధుల నుంచి మినహాయింపు ఇచ్చి వారికి మినిమమ్ టైంస్కేల్‌వర్తింపచేయాలన్నారు. విధుల్లో చేరినప్పుడు జాబ్ చార్ట్‌లో సాయంత్రం 5గంటల నుండి ఉదయం గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించాలని ఉన్నా పదిరోజులకే అప్పటి విద్యాశాఖ కమీషనర్ సంధ్యారాణి 24/7విధులు నిర్వహించాలని మరో ఉత్తర్వు జారీ చేశారని దీంతో కుటుంబాలను వదిలి రాత్రి,పగలు తేడా లేకుండ 24గంటలు విధుల్లో ఉంటూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నామన్నారు. అలాగే బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలన్నారు. పార్ట్‌టైం ఉద్యోగులను అప్కాస్‌లోకి తీసుకొచ్చి అప్కాస్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్ట్‌టైం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు కమీషనర్, సమగ్ర శిక్ష సెక్రటరీ నాగమణి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## వాలంటరీలకు వేలిముద్ర యంత్రాలు పంపిణి..

**కోసిగి, అక్టోబరు 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సత్వరమే ప్రజలకు అందించాలను ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన వాలంటరీలకు సంబందించిన వేలిముద్ర యంత్రాలను గురువారం స్థానిక మండల కార్యాలయంలో వైకాపా మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డి వాలంటరీలకు పంపిణి చేసారు.. ఈ సందర్భంగా ఎంపీపీ లవకుశ ఈరన్న అధ్యక్షతన ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు వాలంటరీలకు ఈ వేలిముద్ర యంత్రాలు(డివైస్)లను పంపిణి చేసారు.. అనంతరం మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఉంటున్న వాలంటరీలకు సకాలంలో సంక్షేమ పథకాలను అందించే నిమిత్తం అవసరమైన వేలిముద్ర యంత్రాలు లేకపోవడంతో పథకాల పంపిణిలో ఆలస్యం జరుగుతుండేదన్నారు.. ఈ విషయాన్ని ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎంఎల్ఎ కోసిగి మండలానికి అవసరమైన స్కానర్లు, కొన్ని చరవాణిలను మంజూరు చేయించారన్నారు.. ఈ స్కానర్లు అంటే వేలిముద్ర యంత్రాల ద్వారా లబ్దిదారుల వివరాలతో పాటు వివిధ పథకాల వివరాలను పొందపరిచి వాటిని అమలు చేసేందుకు వీలుంటుందన్నారు.. ముఖ్యంగా వాలంట రీలు ప్రజలకు సేవలు అందించే విషయంతో అలుపెరగకుండా కష్టపడి పనిచేయాల్సి ఉంటుందన్నారు.. అనంతరం స్కానర్లు, మొబైల్స్‌ను వాలంటరీలకు అందించారు..సింగిల్‌విండో అధ్యక్షులు మఠం మహాంతేష్ స్వామి, బెట్టన్న గౌడ్, మాణిక్యరాజు, నాడిగేని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు..

## అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు లెక్చరర్‌లు వేతనాలు పెంచండి

**నంద్యాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాంఘీక సంక్షేమ పాఠశాలల్లో, కళాశాలల్లో పార్ట్‌టైంగా, అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న లెక్చరర్లకు, టీచర్లకు కాంట్రాక్టు కింద మార్పుచేసి వేతనాలు పెంచాలని పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.నాగస్వరం నరసింహం సాంఘీక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునను కోరారు. గురువారం మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సంవత్సరాలుగా సాంఘీక సంక్షేమ పాఠశాలల్లో నిబద్ధతగా పనిచేస్తు విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడుతూ ఉత్తీర్ణత శాతాన్ని ఏడాదికేడాది పెంచుకుంటూ పోతూ పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఈ గురువులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ పేద పిల్లలే ఈపాఠశాలల్లో చదువుతుంటారని చదువుతో పాటు క్రమశిక్షణతో కూడిన నైతిక విలువలను బోధిస్తు ఉన్నత శిఖరాలను అందుకోవడానికి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఈ ఉపాధ్యాయులపై కనికరం చూపాలని వీరికి వేతనాలు పంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఫలించిన యేళ్ళనాటి నిరీక్షణ

– పారుమంచాల గ్రామస్థులు హర్షం

**జూపాడుబంగ్లా , అక్టోబర్ 27 ప్రభాతవార్త :** ఆ గ్రామస్థుల సూమారు వందేళ్ళ నిరీక్షణ ఫలించింది. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్న ఆ గ్రామస్థులకు బ్రిడ్జి నిర్మాణం కళగానే మిగిలిపోయింది. భారీ వర్షాలు, వరదలు వస్తే ఆ గ్రామానికి వేరే గ్రామాలతో సంబందాలు తెగిపోతాయి. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామానికి వెళ్ళే దారిలో ఇసుకవాగు ఉంది. భారీ వర్షాలకు ఈ వాగు ఉధృతంగా ప్రవహిం చడంతో ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు గ్రామంలోకి వెళ్లలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ ఆళ్ళ ధర్మారెడ్డి చోరువతో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సహకారంతో ఇసుక వాగు బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.25కోట్లు నిధులు మంజూరు చేయించ డంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాదవరం ప్రకాశం, 80 బన్నూరు సొసైటీ చైర్మెన్ ఈదుల నారాయణ రెడ్డి, ప్రజలు ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మరదలు పై బావ దాడి

**బేతంచెర్ల,అక్టోబర్27,ప్రభాతవార్త:** పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన ఈర్ల సోమేశ్వరి పై ఆమె బావ ఈర్ల రామకృష్ణ ఆస్తి తగాదాలో గురువారం దాడిచేశాడని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. అన్నదమ్ముల భాగ పంపకాలలో ఆస్తులు పంచుకున్నప్పటికి రామకృష్ణ తన వాటాను పొగొట్టుకుని తమకు వచ్చిన వాటాలో మరోసారి వాటా కావాలని గొడవకు దిగి దాడి చేశాడని బాధితురాలు తెలిపింది.

## శ్రీశ్రీ ఉల్టిలింగేశ్వరస్వామి ఉత్సవాలు

**పత్తికొండ,అక్టోబర్27,ప్రభాతవార్త:** పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామంలో కార్తీకమాసంను పురస్కరించుకుని ఉల్టిలింగేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు కర్నాటక,మహారాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు.కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయనే నమ్మకంతో స్వామివారికి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు.గంగ దగ్గరకు వెళ్లి గంగస్నానం చేసి ఊరేగింపుచేసి గుడిలోకి చేరుకుంటున్నారు.భక్తులందరూ మనస్సులో అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని దేవుడి పై విశ్వాసంతో నమ్ముకుంటున్నరన్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తాదులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది.అనంతరం స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవికి పెద్దహుల్తిలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ ఉత్సవాలకు వచ్చినందుకు పెద్దహుల్తి గ్రామం తరుపున ఎమ్మెల్యేకు స్వాగతం పలకడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దహుల్తి సర్పంచ్ విజయలక్ష్మి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపిలేని వర్షాలతో మినుము పంట భూమిపాలు

**బేతంచెర్ల,అక్టోబర్27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో ఎడతెరిపిలేని వర్షాలతో మినుము పంట భూమిపాలైందని రైతు మునగాల బాలగుర్రెడ్డి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు.తనకున్న నాలుగున్నర ఎకరా పొలంలో మినుముపంట సాగుచేయగా కోతకు రావడంతో కోసి పొలంలోనే ఉంచాడు.కోసినప్పటి నుంచి ఎడతెరిపిలేని వర్షాలు పడడంతో పంట చేతికిరాకుండా పోయిందని దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపుగా రూ.1.50లక్షలు ఖర్చు చేయడం జరిగిందని ఆయన అన్నారు.ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.రైతు సంఘం నాయకుడు సుబ్బరాయుడు,సీపీఎం నాయకుడు ఈశ్వరయ్య,మహిళా నాయకురాలు పద్మావతిలు పొలాన్ని సందర్శించి రైతును ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈవో శ్రీధర్‌రావు

**అవుకు,అక్టోబర్27,ప్రభాతవార్త:** అవుకు మండలంలోని సంగపట్నం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో శ్రీధర్‌రావు గురువారం తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థులతోపాటు కలిసి ఎంఈవో శ్రీధర్‌రావు భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆహార నాణ్యత,పరిమాణాలను పరిశీలించడం జరిగిందని శ్రీధర్‌రావు తెలిపారు.అంతేకాకుండా పాఠశాలలోని రికార్డులను పరిశీలించడం జరిగిందని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంఈవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను కేటాయించడం జరుగుతుందని కాబట్టి ఈ పథకం ద్వారా విద్యార్థులకు టైంటేబుల్ ప్రకారం భోజనం అందించాలని ఆయన తెలియజేశారు.అదే విధంగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు తెలియజేశారు.

## ఈక్రాప్ డేటాను రైతులతో కలిసి పరిశీలించిన

**కోవెలకుంట్ల,అక్టోబరు,27,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈక్రాప్ డేటాను ఎడిఎ నిరంజన్ రైతులతో కలిసి పొలాల్లో పరిశీలించారు. గురువారము సబ్‌డివిజన్ పరిదిలోని సంజామల,దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాల్లో ఎడిఎ పర్యటించారు. ఈసందర్భముగా పత్తి, జొన్న, కంది పంటలను అయన పరిశీలించారు. ఈసందర్భముగా అయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని చెప్పారు.

## పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

**మిడుతూరు, అక్టోబర్27, ప్రభాతవార్త ;** మండలంలోని వీపనగండ్ల, చెరుకుచర్ల, మిడుతూరు గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి పంటలను ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు సుధారాణి, లక్ష్మి, ప్రాంతీయ వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త ప్రభాకర్, మోహన్, విష్ణువర్దన్ రైతు పొలాలను పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పత్తి పంటలో రైతులకు వివిధ సమగ్ర యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. వివిధ గ్రామాల్లో పత్తి పంట సాగుచేసిన రైతుల ద్వారా వచ్చిన అనేక ఫిర్యాదులను వ్యవసాయ శాస్త్రవేత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పత్తి ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ మండలవ్యాప్తంగా వివిధ కంపెనీలలకు చెందిన పత్తి విత్తనాల ద్వారా పంట దెబ్బతినడానికి గలకారనాలను పై అధికారులకు సమగ్ర నివేదికలను సమర్పించడం జరుగుతుందన్నారు. పత్తి పంట వందల ఎకరాల్లో నాశనం కావడానికి వివిధ రకాల తెగుళ్లతో ప్రాథమిక దశలో పూత రాలిపోవడం జరిగిందన్నారు. వాటికల కారణాలను ల్యాబ్‌కు పంపి వచ్చిన నివేదికల ఆధారంగా కారణాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. పత్తి పంటకు ఏఏ కంపెనీలకు చెందిన పురుగుల మందులు కొట్టారో రైతులను అడిగి తెలుసుకన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్, మండల వ్యవసాయ అధికారి పీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండిబిందె వితరణ

**పాణ్యం, అక్టోబర్27, ప్రభాతవార్త ;** మండలంలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీవలి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి నంద్యాల పట్టణానికి చెందిన కరుణామయ విద్యాసంస్థల చైర్మన్ దండే దస్తగిరి, జయమ్మ కుమారులు దండే వెంకటనరేష్, దండే అవినాష్ సుమారు రూ.75 వేలు విలువ గల ఒక కేజీ ముప్పై గ్రాముల వెండి బిందెను ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామికి అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో పూజలు నిర్వహించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారికి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు.

## నకిలీ పత్తి విత్తన కంపెనీలపై కేసులు నమోదు చేయండి

**పాణ్యం, అక్టోబర్27, ప్రభాతవార్త ;** నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు ఇవ్వాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు రంగనాయుడు డిమాండ్ చేశారు. నకిలీ పత్తి విత్తన కంపెనీలపై కేఉలు నమోదు చేయాలని, నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని జిల్లా సీపీఐ అధ్యక్షుడు రంగనాయకుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పత్తిపంటను పరిశీలించడానికి వచ్చిన వ్యవసాయ శాస్త్రవేత్తలకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విత్తన కంపెనీలైన కావేరీ, వేద, బీదర్, ప్రభాత్, తడాఖా సీడ్స్ ద్వారా మండలవ్యాప్తంగా సుమారు 1500 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయడం జరిగిందన్నారు. పత్తి పంటకు ఎకరాకు రూ.60 వేలు రైతులు పెట్టుబడులు పెట్టి నకిలీ విత్తనాలతో మోసపోయారన్నారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని గగోగలు పెడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నకిలీ విత్తన కంపెనీలపై ఇంతవరకు వ్యవసాయ అధికారులు గానీ, ప్రభుత్వంగానీ చర్యలు తీసుకన్న దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించినకిలీ పత్తి విత్తనాలను తయారు చేస్తున్న కంపెనీ యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలన్నారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, హరిబాబు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**పాములపాడు టౌన్,అక్టోబరు27,ప్రభాతవార్త :** అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ,ప్రయివేట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాని దివాయంగుల మండల నాయకులు భాస్కర్‌రెడ్డి,కెయన్‌వి ప్రభాకర్,చాంద్‌బాష తెలిపారు.గురువారం పాములపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు,పించన్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలుపడం హర్షనీయమన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరువ చూపాలని వారు కోరారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు

**పాములపాడు రూరల్,అక్టోబరు27,ప్రభాతవార్త :**

మండలపరిధిలోని చెలిమిల్ల గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి కరణ్‌జి అనే వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి.పంజాబ్ రాష్ట్రానికి చెందిన కరణ్‌జి మొక్కజొన్న కోత మిషన్‌కు డ్రైవర్‌గా వచ్చాడు.మొక్కజొన్న కోత మిషన్‌ను నడుపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో కరణ్‌జి గాయపడ్డాడు.స్థానికులు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం కర్నూలుప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## రెండవ రోజు ప్రారంభమైన గడప గడపకు మనప్రభుత్వం

**మహానంది, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** మహానంది మండలం అబ్బీపురం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు మండల నాయకులు, గ్రామ ప్రజలు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తు ముందుకు దుసుకుపోతున్నామని ఆయన అన్నారు. ఈపథకాలు అందరికి ఇలాగే కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. గ్రామాల్లో పర్యటించి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమదృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు సిఫారస్సు చేసి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండలం ఎంపిపి యశ్వసిని, మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జీవనశైలిపై అక్షరశ్రీ విద్యార్థుల ప్రదర్శన

**ఆదోనిటౌన్, అక్టోబర్27, ప్రభాతవార్త ;** అక్షరశ్రీ పాఠశాలలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులచే వివిధ అంశాలపైన నిర్వహించిన నైపుణ్య ప్రతిభ పాటవాల ప్రదర్శనను 144 నమూనాలతో సహా 612 మంది విద్యార్థినీ, విద్యార్థులచే పాఠవాల ఆవరణలో నిర్వహించారు. విజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రం, గణితశాస్త్రంతో పాటు భారతదేశ సంస్కృతి మరియు సంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రదర్శన నమూనాలను, దేశ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, కాలుష్యంపై అవగాహన, మొబైల్ వాడకం వల్లలాభ, నష్టాలు, పౌష్టికాహారం పట్ల అవగాహనలాంఇ విషయాలపై నమూనాలను ప్రదర్శించి వాటి విలువలను వివరించారు. అక్షరశ్రీ విద్యార్థినీ, విద్యార్థులకు ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం అక్షరశ్రీ ఆనవాయితీ అని తెలియజేస్తూ ఈ కార్యక్రమం ఉత్సాహంగా, ఉత్తేజంగా విద్యార్థులు పాల్గొని దిగ్విజయంగా నిర్వహించారని పాఠశాల డైరెక్టర్ ఎం.మేఘనాథ్‌రెడ్డి, ఏఓ పి.కవిత, ఎ.పల్లవి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రప్రసాద్, ఉపాధ్యాయ బృందం తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు జనరల్ అవేర్‌నెస్‌పై అవగాహన కల్పిస్తామన్నారు.

## నకిలీ సీడ్స్ కంపెనీలకు వత్తాసు పలుకున్న అధికారులను సస్పెండ్ చేయాలి

**నంద్యాల హాస్పటల్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** జిల్లాలో నకిలీ సీడ్స్ విత్తన కంపెనీలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయి.జిల్లా కేంద్రమైన నంద్యాల నకిలీలకు అడ్డాగా మారిందని వత్తాసు పలుకుతున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా సమితి నాయకులు రంగనాయుడు, బాబా ఫక్రుద్దిన్, ఎం రాముడు, సుబ్బరాముడు, సోమన్నలు డిమాండు చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో 7 వేల ఎకరాల్లో నకిలీ కంపెనీ విత్తనాలతో లక్షల రూపాయలు రైతులు నష్టపోయారని విమర్శించారు. నష్టపంట పొలాలను పరిశీలించేందుకు వచ్చిన శాస్త్రవేత్తలకు అధికారులకు సుధారాణికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతు న్నారని పేర్కొన్నారు. ఓ ప్రజాప్రతినిధే నకిలీ విత్తనాల సృష్టికర్త అని వారు ఆరోపించారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు అత్మహత్యలుచేసుకుంటామని ప్రభుత్వానికి నివేదించినప్పటికి చలనం లేదని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్షరూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీబాలుర వసతిగృహం తనిఖీ చేసిన ఎఎస్‌డబ్ల్యూఓ

**పగిడ్యాల, అక్టోబరు 27, ప్రభాతవార్త :** పగిడ్యాల ఎస్సీ బాలుర వసతిగృహాన్ని అత్మకూరు సాంఘీక సంక్షేమ సహాయ అధికారి వై.వి.సుబ్బారెడ్డి గురు వారం రాత్రి 6.30గంటలకు అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల బోధనవిధానంపై అరాతీశారు. వసతిగృహాలోని వసతులలపై అరాతీశారు. విద్యార్థులను పలుప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయుడిగా అవతారమెత్తిన ఎఎస్‌డబ్ల్యూఓ వై.విసుబ్బారెడ్డి విద్యార్థులను ప్రశ్నలు వేశారు. రాష్ట్రంలో ఎంతమంది ఎంఎల్ఏలు, మంత్రులు, జిల్లా అధికారుల పేర్లను అడిగి సమాధానం రాబట్టారు. ఈకార్యక్రమంలో వసతిగృహ అధికారి విజయబాబు పాల్గొన్నారు.

## రైతులకు గుదిబండగా మారిన విద్యుత్ లైన్‌మెన్‌లు..

– రైతుల మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత..
– లైన్‌మెన్ వేదింపుల నుండి కాపాడాలని రైతుల మొర..
– విద్యుత్ లైన్‌మెన్‌పై ఎంఎల్ఎ ఆగ్రహం..



**కోసిగి, అక్టోబరు 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టి రైతు సంక్షేమం కోసం ప్రయాస పడుతుండగా ఒకవైపు విద్యుత్ సిబ్బంది రైతులను వేదిస్తూ రైతుల పాలిట గుదిబండగా మారి రైతులను వేదిస్తూ చేయి తడిపితే పనులు చేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు..రైతుల మోటర్లకు సరఫరా అవుతున్న విద్యుత్‌ను తొలగించంతో లైన్‌మెన్ తమకు వద్దు అంటూ ఎంఎల్ఎకు మొరపెట్టుకున్న సంఘటన గురువారం కోసిగి గ్రామ పొలాలల్లో చోటు చేసుకుంది..ఈ విషయంలో ఎంఎల్ఎ కూడా ఆ లైన్‌మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసాడు.. వివరాలను పరిశీలిస్తే.. కోసిగి గ్రామ సమీపంలోని నాకెన్ చెరువు పరిధిలో సుమారు 500 ఎకరాలకు సంబందించి 58 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా రైతులు మోటర్‌తో నీటిని వాడుకుంటూ పంటలు సాగు చేసుకునేవారు.. కాగా కోసిగికి వచ్చిన వెంకటరమణ అనే లైన్‌మెన్ మాత్రం రైతుల పొలాలకు వెళ్లి 57 ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన రైతుల విద్యుత్ తీగలను కట్ చేసాడు.. తమ శాఖకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో రైతులు అవాక్కయ్యారు.. దీంతో గురువారం విద్యుత్ తీగలను కట్ చేయడానికి వచ్చిన లైన్‌మెన్‌తో పాటు విద్యుత్ సిబ్బందికి రైతులు అడ్డుపడ్డారు..గత 20 రోజులుగా విద్యుత్ లేకపోవడంతో చేతి కొస్తున్న పంటలకు నీరు అందక వాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.. రైతులకు లైన్‌మెన్‌కు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.. పొలాలల్లోని రైతులు కురువ ఆకాశరెడ్డి, పెద్ద లక్ష్మయ్య, పరసాని రామాంజినేయులు ముక్కుమ్మడిగా వచ్చి విద్యుత్ సిబ్బందితో వాగ్వివాదం చేసారు.. తమను రోజు వేధిస్తూ చేయి తడిపితేనే తమ పని అవుతుందని లైన్‌మెన్ గట్టిగా చెప్పుతున్నాడని రైతులు సాతనూరు మంజు, పరసాని మౌలాలి, కురువ నాగిరెడ్డిలు వాపోయారు..లైన్‌మెన్ ప్రవర్తన రైతుల పాలిట గుదిబండగా మారడంతో ఈ విషయాన్ని ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు..ఈలాంటి లైన్‌మెన్ తమకు వద్దు అంటూ, రైతులను జలగలా పీడిస్తున్న ఈ లైన్‌మెన్ తమ మండలానికి వద్దు సార్ అంటూ ఎంఎల్ఎ బాలనాగిరెడ్డికి మొరపెట్టుకున్నారు.. దీంతో విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ రైతుల పట్ల అనుచితంగా ప్రవర్థించిన లైన్‌మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసాడు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఎంతో కృషి చేస్తుంటే లైన్‌మెన్‌గా ఉంటూ ఇలా రైతులను వేధించడం సరికాదని, రైతుల పట్ల అనుచితంగా ప్రవర్థిస్తే చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.. దీంతో విద్యుత్ సరఫరా నిపిపి వేసిన రైతులందరికి విద్యుత్ కనెక్షన్‌లను ఇవ్వడంతో రైతులు శాంతించారు. జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరమణ అనే విద్యుత్ ఉద్యోగి తానే సర్వమై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారిగా చెలామణి చేస్తూ గ్రామంలోని ప్రజలకు, రైతులకు తలనొప్పిగా మారినట్లు గ్రామస్తులు వాపోతున్నారు..నియోజక వర్గ స్థాయిలో ఉంటే విద్యుత్ ఉన్నతాధికారికి అనుకూలంగా మారినట్లు దీంతో ఈయన ఆడిందే ఆట పాడిందే పాటగా మారినట్లు తెలుస్తోంది..ఈ శాఖలో తనపై లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్లు ఉన్నప్పటికి వారి మాటను వినకుండా తానే అన్ని పనులను చేస్తుండడం విశేషం..ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ లైన్‌మెన్ పట్ల తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..

## ఈక్రాప్ పంటనమోదు పరిశీలన

**పగిడ్యాల, అక్టోబరు 27, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా కలెక్టర్ అదేశాలమేరకు పగిడ్యాల తహాశీల్దార్ భారతి పగిడ్యాలలో గురువారం ఈ క్రాప్ పంటనమోదులో భాగంగా పీల్డుకు వెళ్లి రైతులు సాగుచేసిన పంటను పరిశీలించారు. రైతులు సాగుచేసిన పంటల వివరాలను రెవెన్యూసిబ్బంది అన్‌లైన్‌లో నమోదు చేశారు. అయినప్పటికీ జిల్లా కలెక్టర్ అదేశాలమేరకు పీల్డుకు వెళ్లి రైతులు సాగుచేసిన పంటల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల విఆర్ఓ నాగన్న, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

**లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజి వాటర్ ట్యాంకును పరిశీలించిన అధికారులు :**

పగిడ్యాల మండలం లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజి వాటర్‌ట్యాంకును గురువారం ఎంపిడిఓ బివి.రమణ, ఇఓఆర్‌డి పుల్లయ్య పరిశీలించారు. సమ్మర్‌స్టోరేజి నుంచి సంపుకు నీరు రావడంతోపాటు పిల్టర్ బెడ్లను కూడాను పరిశీలించారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి సక్రమంగా ఎన్నిగ్రామాలకు తాగునీరు అందుతుందనీ, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సాగునీటి వసతిపట్ల అధికారులు అరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బవి.రమణ, ఇఓఆర్‌డి పుల్లయ్య వెంట పంచాయతీ కార్యదర్శి సమతాయశోధర, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట సభల్లో మేధావుల గళం వినిపిద్దాం

**నందికొట్కూరు,అక్టోబర్ 27,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై పోరాడేందుకు చట్టసభల్లో మేధావుల గళం వినిపించేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం స్తానిక సిఐటియు కార్యాలయంలో టీచర్స్,పట్టభద్రుల, ప్రజా సంఘాల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పక్కీర్‌సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజకవర్గం బాధ్యులు కె.బాస్కరరెడ్డి, పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతు ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహ్మారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు పిడియఫ్ తరపున ఎన్నికల బరిలో ఉన్నారని కావున మేధావులు, డాక్టర్లు, ప్రజాతంత్ర వాదులు, ఎస్సీ,ఎస్టీ, బీసి, మైనార్టీలు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపంచాలని వారు కోరారు. అర్హులైన వారందరు తమ ఓటు నమోదు చేయించుకోవాలని, నవంబర్ 7వ తేదీన నమోదు గడువు ముగుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మధు, జయరాణి, వేణుగోపాల్, ఆంజినేయులు, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.39 లక్షలతో ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులు

**గోనెగండ్ల అక్టోబరు 27 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఉర్దూ పాఠశాల పాత భవనలు కావడంతో స్కూల్ పై కప్పు పెచ్చిలు ఊడి విద్యార్థులపై పడి గాయాలు అయ్యాయి.స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పాఠశాలను సందర్శించి నాడు నేడు కింద కొత్త భవనల నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను అదేశించారు.ఇందుకు అధికారులు స్పందించి రూ.39 లక్షలతో నూతన భవన నిర్మాణాపనులకు గాను గురువారం భూమి పూజ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్,ఎంఈవో వినోద్‌కుమార్, మాజీ కో అప్షన్ సభ్యులు బందెనవాజ్ లు నిర్వహించారు.త్వరగా నూతన భవన నిర్మాణాపనులు పూర్తిచేస్తామన్నారు.ఈకార్యక్రమంలో స్కూల్ ఛైర్మెన్ వైకాపా పద్మనాభం,రఫి, నద్దిమూల్లా,తాయప్ప, మాజీ మండల కన్వీనర్ గొవింద్,కే మాబువలి,కమల్‌భాష, ఉస్సేన్,నాగేష్,మునప్ప,పాఠశాల ఉపాధ్యాయురాలు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కబ్జాదారులు తీసిన పాదులు పూడ్చివేత- వార్తా ప్రభావం



కబ్జాదారులు తీసిన పాదులను జెసిబితో పూడ్చివేస్తున్న

**జూపాడుబంగ్లా , అక్టోబర్ 27 ప్రభాతవార్త :** జూపాడుబంగాలో అక్రమ కట్టాదాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఖాళీ స్థలాల కబ్జాకు జూపాడుబంగ్లా చిరునామాగా మారింది. పార్కులు, రోడ్డు, ఖాళీ స్థలాలు ఆక్రమణదారులు అందిన కాడికి కబ్జా చేస్తున్నారు. ఇలా ఏదైనా కాదేదీ కబ్జాకు అనర్హం అనే రీతిలో చెలరేగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వార్తా దిన పత్రికలో జాతీయ రహదారియే కదా..కబ్జా చేసేయ్..! నిద్రావస్థలో నేషనల్ హైవే అధికారులు అనే శీర్షికన వార్తా ప్రచురితమైంది. వార్తాకు స్పందించిన స్థానిక వైకాపా నాయకుడు జంగాల పెద్దన్న, గ్రామ సర్పంచ్ మోటు బాలయ్యలు జాతీయ రహదారి స్థలంలో అక్రమార్కులు తీసిన పాదులను జెసిబితో పూడిపించారు. దీంతో శుక్రవారం జరిగే సంతమార్కెట్‌కు మార్గం సుగమమైంది అయితే నేనల్ హైవే స్పందించక విచారకరం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జాతీయ రహదారి వెంట అక్రమంగా కట్టాదాలను తొలగించాలిని గ్రామస్థులు కోరుతున్నారు..

## టిడిపి పట్టభద్రుల అభ్యర్థి గెలుపుకు కృషిచేద్దాం

**- మాజీ ఎమ్మెల్యే భూమా**



**నంద్యాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి పట్టభద్రుల అభ్యర్థుల గెలుపుకు అందరు ఐక్యమత్యంతో కలిసి పోరాడితే విజయం తధ్యమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జీ భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు బస్టాండు పరిధిలో ఉన్న టిడిపి పార్లమెంటరీ బిసి సాధికారిక కన్వీనర్ ఉప్పరి సురేష్‌కుమార్ ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత భావం ఉందని పేర్కొన్నారు. డిగ్రీ చదివిన పట్టబద్రులు టిడిపి పార్టీకి అనుకూలంగా ఉన్నారని వారికి గతంలో నిరుద్యోగ భృతి కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక కూలిపనులకు వెళ్తున్నారని నిరుద్యోగులంతా మూకుమ్మడిగా వైసీపీ ప్రభుత్వాని తరిమికొట్టెందుకు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పట్టభద్రులంతా ఓటరుగా నమోదుచేసుకొని, తమ అమూల్యమైన ఓటు హక్కును టిడిపి పార్టీ అభ్యర్థి అయిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విజయానికి ప్రతిఒక్కరు కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నవంబరు 1 నుంచి ఫుట్‌పాత్ కాల్వలపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలి



నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

**నంద్యాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** నంద్యాల నందవనంగా చేసేందుకు మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. గురువారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల పట్టణం జిల్లాకేంద్రమైనందున పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలన్న అంశంతో ఒక ప్రత్యేక కార్యచరణ పథకాన్ని చేపడుతున్నారు. నవంబరు 1వ తేదిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈకొత్త ఏర్పాట్లను చేపట్టారు. నేటి మున్సిపాలిటి చట్టం ప్రకారం అక్రమణలు తొలగించాలన్నారు. ప్రధాన కూడళ్ళల్లో ఫుట్‌పాత్, కాల్వలపై, రోడ్లకిరువైపుల ఉన్నటువంటి శాశ్వత, తాత్కాలిక అక్రమ కట్టడాలను తీసివేయబడతాయి. అ క్రమణదారులు వారి కట్టడాలను సదరు తాత్కాలికమైన శాశ్వతమైన నిర్మాణాలు నవంబరు 1వ తేదిలోగ తొలగించుకోవాలి. లేనిఎడల పట్టణ ప్రణాళిక డిపార్టుమెంటు వారిచేత తొలగించబడును, అంతేకాకుండా జరిగే నష్టానికి మున్సిపాలిటి వారు ఏవిధంగా బాధ్యత వహించదు. జిల్లా ప్రాంతమైనందున ట్రాఫిక్ సమస్య అధికమయిందని పల్లె ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం పట్టణానికి, జిల్లా కేంద్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే పట్టణమంతా నీటితో నిండిపోయింది. ఈసమస్యల పరిష్కారం కోసం అక్రమణలను తొలగించడానికి పట్టణ ప్రణాళిక చర్యలు చేపటిట్టింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటి చట్టం తొలగింపునకు అవు ఖర్చును అక్రమణదారుల నుంచి మూడింతల ఎక్కువగా వసూలు చేయబడును కావునా ఫుట్‌పాత్‌లపై కాల్వలపై, కూడలిసెంటర్లల్లో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్డులను ఏవరికి వారు తొలగించుకోవాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలి

**ఆదోనిలీగల్, అక్టోబర్27, ప్రభాతవార్త ;** ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆరోగ్యంగా ఉండాలంటూ ఆదోని ఐక్యసంఘముల ఫాస్టర్ల ఫారంకు చెందిన ఫాస్టర్లు గురువారం ప్రార్థనలు చేశారు. ముందుగా ఐక్యసంఘముల ఫాస్టర్స్ ఫారమ్ సభ్యులు ఎమ్మెల్యేను పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే ఇంట్లో కాలు జారిపడడంతో ఎడమచేతికి ఫ్యాక్చర్ అయ్యింది. విషయం తెలుసుకున్న వారు ఎమ్మెల్యేను గురువారం పరామర్శించారు. అనంతరం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు జోసఫ్‌జాషువా, ఆంతోనీ, యేసురాజు, తిమోతీ, ప్రకాష్, ఆశీర్వాదం, రాజేష్, దేవదాస్, ఫిలిప్, జైపాల్, రాహుల్ పాల్గొన్నారు.



## జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణిలో.. అవకతవకలు జరగకూడదు

**- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

**- విడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

**నంద్యాల విద్య, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసేందుకు నాడు నేడు పథకం కింద కోట్లాది రూపాయలు ఖర్చుచేసి పేద ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందుకే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు, ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో విడియోకాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరు చాంబరు నుంచి జూమ్ విడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టరు నారపురెడ్డి మౌర్య, జిల్లా విద్యాశాఖాధికారి అనురాధలు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వసరులు కల్పించామన్నారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణిలో అలస్యానికి తావులేకుండా నూరుశాతం పంపిణి చేయాలని, వస్తువుల నాణ్యతలో రాజీపడకుండా బ్రాండెడ్ వస్తువులను పంపిణి చేయాలని అదేశించారు. జిల్లా కలెక్టరు డా.మనజీర జిలాని సామూన్ మాట్లాడుతూ కొన్ని పాఠశాల విద్యార్థుల బూట్లల్లో మిస్‌మ్యాచింగ్ జరిగిందని తెలిపారు. జిల్లాకు 959 పాఠశాలలు, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండవ విడత నాడు నేడు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సంబంధిత ఎంఇఒ లకు కాలపరిమితిలోగ పూర్తిచేసే లక్ష్యాన్ని కేటాయించామని తెలిపారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు టాయిలెట్లు కూడ ఉపయోగంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎంఇఒలతో బౌతిక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రగతిని సమీక్షిస్తు దిశానిర్దేశం చేయాలని డిఇఒ అనురాధను కలెక్టరు అదేశించారు. చేపట్టిన పనుల్లో ఎప్పటికప్పుడు ఖర్చు వివరాలు అన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జేసి

## రైతులు నష్టపోతున్నా పట్టించుకోని కర్ణాటక-ఆంధ్ర ఎల్‌ఎల్‌సి ఉన్నతాధికారులు

**- టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి**

**ఆదోని, అక్టోబరు 27, ప్రభాతవార్త :** కర్ణాటక-ఆంధ్రా ఎల్‌ఎల్‌సి ఉన్నతాధికారులు రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఉదయం టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, ఆలూరు తాలుక టిడిపి ఇంచార్జ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్ ఎల్‌సి నీటి కోసం పెద్దఎత్తున ధర్నా చేపట్టడం జరిగింది. ఈ ధర్నాకు వెళుతున్న సమయంలో పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపుగా ఎల్‌ఎల్‌సి కాలువ యుటి పిల్లర్ తెగిపడడంతో ఆంధ్ర-కర్ణాటక రైతులు నష్టపోతున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్రలో ఉందన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నష్టపోతున్న మిరప పంట రైతులకు రూ.50వేలు చొప్పున తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ఎల్‌ఎల్‌సి ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎస్‌సి మరియు ఈఈ, డిఈ ఉన్నతాధికారులతో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో ఎల్‌ఎల్‌సి కింద వ్యవసాయం చేస్తున్నారన్నారు. మోకా తాలుక పరిధిలో బరదనహళ్లి దగ్గర కాలువపై 16వ వంతెన పిల్లర్ కూలి అక్కడి నుండి దిగువన ఉన్న ఆయకట్టు రైతుల పంట పొలాలకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. వచ్చే నెల 1వ తేదీలోపు రైతులకు నీరు ఇవ్వకుంటే బళ్లారిలోని ఎల్‌ఎల్‌సి ప్రధాన కార్యాలయం ముట్టడిస్తా మని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మదిరె భాస్కర్‌రెడ్డి, రామస్వామి, దేవేం ద్రప్ప, వడ్డెమాన్ గోపాల్, సోమశేఖర్‌రెడ్డి, మల్లేశప్ప, శ్రీనివాస్, రాముడు, పరమేష్, సుధాకర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు

## ప్రతి పేదవానికి సంక్షేమపథకాలు అందించడమే వైకాపా లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీదేవి



రామళ్లకోటలో ఎమ్మెల్యే స్వాగతం పలుకుతున్న రాధాక్రిష్టారెడ్డి దంపతులు, నాయకులు

**వెల్దుర్తి, అక్టోబర్27, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమపథకాలు అందించడమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు. మండలంలోని రామళ్లకోట గ్రామంలో గురువారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికై రామళ్లకోట గ్రామం చేరుకున్న ఎమ్మెల్యే శ్రీదేవికి మాజీ సర్పంచ్ దాదిరెడ్డి లీలావతి, రాధాక్రిష్టారెడ్డి పూలమాల వేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామసర్పంచ్ నిర్మల, మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, వైకాపా నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి గడపకు ఆమె తిరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (జగనన్న) అందిస్తున్న సంక్షేమపథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. అడుగడుగున ఎమ్మెల్యే శ్రీదేవి అపూర్వ ఆదరణ లభించింది. గ్రామస్తులు తమ ఇళ్లలోకి రావాలంటూ ఎమ్మెల్యేను ఆహ్వానించగా ఎమ్మెల్యే వారి ఆహ్వానం మేరకు వారి ఇళ్లలోకి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమపథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే వారిని అడుగగా తమకు అన్ని పథకాలు వస్తున్నాయని, ఇలాంటి ముఖ్యమంత్రి మరల ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. మీరు మళ్లి మాకు ఎమ్మెల్యేగా ఉండి సేవలందించాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల వారికి ప్రభుత్వ పథకాలను కులమతాలు, పార్టీలకతీతంగా అందిస్తున్నామన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమపథకాలు ఆపకుండా దేశంలోని ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి సాహసం జగనన్నదే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి, గ్రామసర్పంచ్ నిర్మల, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఇఓఆర్డీ నరసింహులు, ఏఓ అక్బర్‌బాష, మాధవస్వామి, మాజీ ఎంపిటిసి దాదిరెడ్డి క్రిష్టారెడ్డి, దాదిరెడ్డి రాధాక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ లీలావతి, కో-ఆప్షన్ సభ్యులు బాగాని మాలిక్‌బాష, రామయ్య, బత్తులరాముడు, కొత్తూరు వెంకటేశ్వర్‌రెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, వెంకటనాయుడు, గట్టు ఆరిఫ్, ఓం మధు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం



పథకాల కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న ఎమ్మెల్యే

**కల్లూరు, అక్టోబర్27, ప్రభాత వార్త:** కల్లూరు అర్బన్‌లోని 34వ వార్డులోని బృందావన్ నగర్‌లో మరియు సోమిశెట్టినగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడప గడపకు తిరుగుతూ ప్రతిఒక్కరికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల గురించి అందరికి చెబుతూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పథకాలన్ని అర్హులైన వారందరికి అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పథకాలు పొందినవారు జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ మరియు కాలువలు వంటి సమస్యలతో ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అలాగే అందుబాటులో ఉండే కార్పొరేటర్‌కు తెలియపరచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య అయిన తనకు తెలియపరచాలని సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఇప్పటికే ఎమ్మెల్యే సహకారంతో ప్రతి ఇంటికి కుళాయి ఇప్పించానని అలాగే డ్రైనేజీ, కాలువ సమస్యలను పరిష్కరించానని అలాగే ఇంకా వార్డు అభివృద్ధికి తోడ్పడిన ఎమ్మెల్యేకి మరియు మేయర్ బి.వై.రామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, స్థానిక వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సానా శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సక్సెస్.. హఠాత్తుగా ఫిట్స్ మరణం

**- ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే సహాయం చేసినా నిలబడని ప్రాణం**

**- ఒక సొంత చెల్లిని కోల్పోయినంత బాధగా ఉంది - ఎమ్మెల్యే శిల్పా**





ముఖ్యమంత్రి సభలో చిన్నారి పావనిని పలకరిస్తున్న ఫైల్ ఫోటో

**నంద్యాల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణానికి చెందిన చిన్నారి పావని ఆరోగ్యం సరిగా లేదని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆళ్లగడ్డలో జరిగిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ వద్దకు తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్యానికి ముఖ్యమంత్రి భరోసా ఇచ్చి తక్షణమే నిధులు వెంటనే అందించాలని అదేశాలు జారీచేశారు. జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, పట్టణంలోని ప్రముఖులు, కౌన్సిలర్లు, దాతలు అమ్మాయిని అదుకునేందుకు తలా కొంత సహాయంచేసి ఆపరేషన్‌కు సిద్దం చేశారు. హైదరా బాద్‌లో గురువారం అపరేషన్ పూర్తిగాద సక్సెస్ అయింది. అయితే అంతలోనే ఆ పావనికి ఫిట్స్ రావడం, గుండెకొట్టుకోవడం అగిపోయింది. చివరికి ప్రాణం పోయింది. ఆపరేషన్ సక్సెస్ అయింది. నంద్యాల పట్టణానికి చేరుకుంటారని ప్రజలందరు భావించారు. కుటుంబ సభ్యులు కూడ ఆనందం వ్యక్తం చేశారు. అయితే హఠాత్తుగా మరణం సంభవించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్‌లు ఒక సొంత చెల్లిని కోల్పోయినంత బాధగా ఉందని భావనను వ్యక్తం చేశారు.

## " వైసీపీ కేవలం మాటల ప్రభుత్వం ..'

**- రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేత హామీ ఏమైంది - మాజీ ఎమ్మెల్యే బీసీ'**

**- గొర్విమానుపల్లెలో బీసీకి ఘన స్వాగతం పలికిన మూలే సోదరులు**



బీసీ కి స్వాగతం పలుకుతున్న మూలే సోదరులు

**గొర్విమానుపల్లె(కొలిమిగుండ్ల), అక్టోబరు 27, ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లు గడిచినా కేవలం మాటలు తప్ప అభివృద్ధి కానరావడం లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి విమర్శించారు. గురువారం కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, హుస్సేన్‌రెడ్డి సోదరుల అధ్యక్షతన టిడిపి బాదుడే బాదుడు .. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ బీసీ.జనార్ధనరెడ్డికి మూలే సోదరుల ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీ జనార్ధనరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ తన అనుభవా రాహిత్యాంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండి పడ్డారు. ఎన్నికల ముందు అమరావతి రాజధానిగా ఒప్పుకున్న జగన్, ముఖ్యమంత్రి అయ్యాక రాజధానిని నాశనం చేశారని విమర్శించారు. మండలంలో ప్రధాన జీవనాధారం నాపరాతి గనులేనని, ఎన్నికల ముందు రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తి వేస్తామని బీరాలు పలికిన స్థానిక వైసీపీ ముఠా నేతలు, ఆ హామీని తుంగలో తొక్కారని బీసీ ఘాటుగా విమర్శించారు. కనీసం వైసీపీ హయాంలో పెంచిన రాయల్టీని కూడా తగ్గించలేక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అంటూ గొప్పలు చెప్పడం తప్ప ఏ ఒక్కటీ అందరికీ అందడం లేదని, ఆంక్షలు విధిస్తూ కోతలు పెడుతున్నారని బీసీ విమర్శించారు. గత మూడేళ్లలో గొర్విమానుపల్లె గ్రామంతో పాటు బనగానపల్లె నియోజకవర్గంలోని ఏగ్రామంలో అభివృద్ధి జరగలేదని, గ్రామాల అభివృద్ధి టిడిపి హయాంలోనే జరిగిందని అన్నారు. గొర్విమానుపల్లెలో రూ.కోట్లాది రూపాయల నిధులతో సిసి రోడ్లు, కుంటల పూడికతీత పనులు తదితర అనేక పనులు తాను ఎమ్మెల్యేగా వుండగా చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, టిడిపి యువనేత కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, విఆర్.లక్ష్మీరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుశేన్‌రెడ్డి, కార్యదర్శి నంద్యాల ప్రసాదు, కల్వటాల కామిని క్రిష్ణరంగారెడ్డి, బాస్కరరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, తోట శివారెడ్డి, ప్రతాపరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, కమ్మువారిపల్లె రాందాస్, కోటపాడు శివరామిరెడ్డి, శివారెడ్డి, కొలిమిగుండ్ల బొట్టుస్వామి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

గొర్విమానుపల్లెలో క్షీణించిన శాంతిభద్రతలు- మూలే:- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గొర్విమానుపల్లె గ్రామంలో స్థానిక వైసీపీ నాయకుల కారణంగా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండల టిడిపి అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి ఆరోపించారు. గ్రామం అసాంఘీక కార్యకలాపాలకు అడ్డగా మారిందని అన్నారు. ప్రతి రోజూ పోలీసులు గ్రామంలో పర్యటించాల్సిన పరిస్థితులు ఏర్పడటం గ్రామానికి సిగ్గు చేటని మూలే రామేశ్వరరెడ్డి వాపోయారు.

## సృష్టిలో జీవరాశులకు నీరు..ఎంతో అవసరం..!

**:- నేషనల్ జలజీవన్ టీంమెంబర్ అనిల్‌కుమార్**



**హాలహర్వి, అక్టోబరు 27, ప్రభాతవార్త :** సృష్టిలో జీవరాశులకు నీరు..ఎంతో అవసరమని జలజీవన్ నేషనల్ టీంమెంబర్ రమేష్, బోజలు అన్నారు. గురువారం మండల పరిధిలోని విరుపాపురం గ్రామంలోని గ్రామ సచివాలయంలో సర్పంచ్ మోక సిద్దమ్మ అధ్యక్షతన వార్డుమెంబర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కమిటీ మెంబర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నేషనల్ టీంమెంబర్స్ రమేష్, బోజలు మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీరు ఎంతో అవసరమన్నారు. అందులో బాగంగానే గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్రప్రభుత్వం ఎన్నో పథకాలను అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వార తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిధిలోని చింతకుంట, బాపురం, అర్థగేరి, విరుపాపురం గ్రామాలను వారు సందర్శించి అక్కడిసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విరుపాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి తాగునీరు, పరిసరాల పర్యవేక్షణపై చర్చించారు. గ్రామంలో కొత్తపైప్‌లైన్, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామప్రజలు కోరగా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో తీర్మాణం అందించి పనులు జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌కుమార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు లక్ష్మన్న, ఈఓఆర్‌డి మల్లికార్జున, లక్ష్మీనారాయణ, విజయరాజు, వేముల శంకర్‌రెడ్డి, ఐఎస్‌ఐ టీం స్వర్ణలత, శివ, వెంకటలక్ష్మి, సదానందం, అంగన్‌వాడి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో మంచి పౌష్టికాహారం అందించాలి

**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం**



అంగన్‌వాడి కార్యకర్తలకు సెల్‌ఫోన్ అందచేస్తున్న మంత్రి జయరాం

**దేవనకొండ, అక్టోబరు 27, ప్రభాతవార్త :** అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని మొత్తం 74అంగన్‌వాడి కేంద్రాలకు సిడిపిఓ సావిత్రిదేవి ఆధ్వర్యంలో మంత్రి జయరాం చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్‌లను అంగన్‌వాడి కార్యకర్తలు జాగ్రత్తగా వినియోగించుకోవాల న్నారు. ఆఫీస్ పనులకు మాత్రమే ఈ ఫోన్ వాడుకోవాలన్నారు. అంగన్ వాడి సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పత్తికొండ, అక్టోబర్27, ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో కరెంట్ ఆఫీస్ ఎదురుగా బ్రాహ్మణ వీధిలో యశోదగార్డెన్స్‌లో రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తున్నరన్నారు. అలాగే పట్టణంలోని వివిధ వీధుల్లో, వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాస్, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, సర్పంచ్ దీపికా, పంచాయతీరాజ్ డీఈ, ఈఈ, ఏఈ, ఎంపిడివో పార్థసారధి, ఎంపిటిసిలు, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోళ్లపాడు అభయారణ్యంలో బీటీ రోడ్డు పనులను పరిశీలించిన ఎంపీ పోచా



**మిడుతూరు, అక్టోబర్27, ప్రభాతవార్త ;** మండలంలోని రోళ్లపాడు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో వేసిన బీటీ రోడ్డు పనులను గురువారం నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. అభయారణ్య పర్యాటకుల సౌకర్యార్థం కోసం ఎంపి తన సొంత నిధులు రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో బీటీ రోడ్డు వేసి చదును చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఏఎస్ఐ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఏ తొగూరు

**పాములపాడు రూరల్, అక్టోబరు27, ప్రభాతవార్త :** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఏ తొగూరు ఆర్థర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగూడూరు గ్రామంలో జరిగిన గడపగడప మనప్రభుత్వ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వస్పందన లభించింది. శాంతినిలయం గురువారం గ్రామంలో గురువారం ప్రతి ఇంటికి వెళ్లిన ఎంఎల్‌ఏ తొగూరు ఆర్థర్, వైకాపా నాయకులు ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకవస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి విద్యకు, ప్రజల ఆరోగ్య సంరక్షణకు అధికప్రాధన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ రత్నరాధిక, ఈవోపిఆర్డీ సుమిత్రమ్మ, ఎంఇవో బాలాజినాయక్, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరక్టర్ రామసబ్బయ్య, ఇస్కాల సర్పంచ్ మౌలాలి, మండల ఉపాధ్యక్షులు బండ్లమూరి వెంకటేశ్వర్లు, మండల వైకాపా నాయకులుబాలీశ్వరరెడ్డి, రాజన్న, చౌడయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.13.55లక్షలు

**కర్నూలురూరల్, అక్టోబర్27, ప్రభాతవార్త:** కర్నూలు మండలంలోని వెంకాయపల్లె గ్రామ సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం జరిగింది. ఆలయ ఈవో సీతారామిరెడ్డి పర్యవేక్షణలో మరియు ఆలయ దేవస్థానం చైర్మన్ బేతం కృష్ణుడు మరియు దేవాదాయ శాఖకు చెందిన పర్యవేక్షణ అధికారి హనుమంతరావు సమక్షంలో ఆలయ పూజారులు హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టగా మొత్తం రూ.13,55,099లు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, ఆలయ పూజారులు యల్లరాజు, చిన్నయ్య, నారాయణ, బాలు, తాలుకా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపులో భాగంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు, ఆలయ ఈవో సీతారామిరెడ్డి, తాలుకా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.



హుండీ లెక్కింపు చేవడుతున్న దృశ్యం